"మీ అత్తయ్య స్వీట్సు ఇచ్చింది!" అంటూ వద్దంటున్నా వినిపించుకోలేదు. పైగా... ఆయన కూతురు నన్ను చూసి పళ్ళికిలిస్తోంది!"

మనోహర్ మాటలకి తల్లీకూతుళ్లు ఇట్టే అర్థాలు కల్పించుకున్నారు.

"ఇప్పటి నుంచే నీకు మస్కా కొట్టి అల్లుణ్ణి చేసుకుందామనుకుంటున్నాడు రోయ్! ఆ పదవ తరగతి థర్డ్‌క్లాస్‌లో పాసయిన కూతుర్ని నీకు లైనెయ్యమని చెప్పుంటాడురా! లేకపోతే... ఇంత ఖరీదు పెట్టి కిలో స్వీట్సు ఇస్తాడా?" అపర్ణ ఊహించి వర్ణించింది.

"నీచమైన బుద్ధులు! అప్పనంగా ఎలా కొట్టేద్దామా... అని చూస్తుంటారు. వీళ్ళాటలు మన దగ్గర సాగవు!" సీతాలక్ష్మిగారు కొడుక్కి జాగ్రత్తలు చెప్పింది.

వాళ్లు చెప్పింది నిజమే- అనిపించి, "సరే..!" అంటూ తలూపాడు.

అంతలో... ఫ్రెండ్సు రావడంతో మనోహర్ వారి వెంట వెళ్లిపోయాడు.

సాయంకాలం ఇంటికి తిరిగి వచ్చిన మనోహర్ గాలి తీసిన బెలూనులా ఉన్నాడు. పొద్దుటి ఉత్సాహం అతనిలో లేశమైనా లేదు. నిరుత్సాహం పేరుకుంది.

"ఒరే మనోహర్! ఎంతో కష్టపడి చదివావు. వెయ్యిలోపునే ర్యాంకు వస్తుందనుకున్నాం! ప్రైవేటు కాలేజీలోకాని సీటు రాదురా! నువ్వు మళ్లీ ఎమ్‌సెట్ రాయడం మంచిదిరా!" స్నేహితుల మాటలు పదేపదే గుర్తుకువస్తున్నాయి.

మళ్లీ చదివి పరీక్ష రాయడమంటే మాటలా..?

ఇంటర్ అహోరాత్రులు కష్టపడి చదివాడు. 75% వచ్చింది.

ఎమ్‌సెట్‌కు అంతకంటే కష్టపడి చదివాడు కాని, మూడు వేల ర్యాంక్ వచ్చింది.

ఉదయం లేచింది మొదలు... రాత్రి 12 గంటల వరకు చదువు.., చదువు! ఏ షికార్లూ, సినిమాలూ లేవు. ఆ ర్యాంక్ ఎలా వచ్చిందో మనోహర్‌కి ఎంత ఆలోచించినా అర్థంకాలేదు.

చివరకు 'అంతే అదృష్టం!' అనుకున్నాడు.

జానకీ రాంగారు కూడా ఆఫీసు నుంచి సాయంకాలం తిరిగి వచ్చాడు.

పొద్దుటి ఉత్సాహం అతనిలో లేదు. బూట్లైనా విప్పుకోకుండా వాలుకుర్చీలో చతికిలపడ్డాడు.

సీతాలక్ష్మిగారు భర్తను చూసి కాఫీ కలిపి పట్టుకొచ్చి ఇచ్చింది. భర్తను చూసి ఆశ్చర్యపోయింది.

"అదేమిటండీ... అలా ఉన్నారు?" ఆవిడ కాసేపు అక్కడే నిలబడినా ఆయన సమాధానం చెప్పలేదు.

మనోహర్ మాటలకు ఆశ్చర్యపోయింది సువర్ణ.

"నాన్నగారికి నిజమైన భారం అక్కరా! దాని పెళ్లికి బోల్డంత అప్పు చేసారు. పండగలకు దానికి మరింత ఖర్చయింది. ఆ అప్పులు తీరకుండానే మొదటిసారి పురిటికి ఆఫీసులో లోను తీసుకున్నారు. మళ్లీ పురిటికి వచ్చింది. ఆమెరా నిజమైన భారం!"

"ఈ విషయాలన్నీ నీకెలా తెలిసాయి అక్కా?" ఈసారి ఆశ్చర్యపోవడం మనోహర్ వంతయింది.

"మొన్న అమ్మా, నాన్నా మాట్లాడుకుంటుంటే విన్నానురా! అందుకే నేను ఓ నిర్ణయానికి వచ్చాను. కాలేజీ అయిపోయిన తరువాత సాయంకాలం నా ఫ్రెండు గీత ఇంట్లో ట్యూషన్స్ చెప్పడానికి ఏర్పాట్లన్నీ చేసుకున్నాం!"

"ఇవన్నీ నాన్నకి, అమ్మకి తెలిస్తే తిడతారేమో? నువ్వు భయపడ్డం లేదా అక్క"

"అమ్మతో ముందే చెప్పా!" అంది మామూలుగా.

అంతలో... తల్లి పిలవడంతో అటు వెళ్లింది సువర్ణ.

చాటు నుంచి చెల్లి, తమ్ముడి సంభాషణలు విన్న అపర్ణ మనస్సు బాధతో మెలికలు తిరిగి బి.ఎ. వరకు చదువుకున్న తను ఆ విషయాలన్నీ ఎందుకు ఆలోచించలేదని బాధపడింది. పుట్టింట్లో అందరి మధ్య ప్రేమాభిమానాలు పంచుకుంటూ ఉండచ్చనుకున్నాగాని, ఇంటి ఆర్థిక పరిస్థితి ఆలోచించలేకపోయానని కుమిలిపోయింది.

ఇల్లంతా ఒక్కసారి పరిశీలనగా చూసింది.

ఇల్లంతా పాత సామానుతో పాతకంపు కొడుతోంది. ఒకటే బెడ్‌రూమ్. అందులో డబుల్ కాట్ మంచం మాత్రం కొత్తది. అది తన పెళ్లి ముందు కొన్నది. పైకి ఏమీ తేలలేదు. వెంటనే భర్తని రమ్మని ఉత్తరం రాసింది.

తమ్ముడి చేత పోస్టు చేయించి ఊపిరి పీల్చుకుంది.

మరునాడు పొద్దుట మామూలుగానే తెల్లవారింది. జానకీ రాంగారు కాఫీ తాగుతూ పేపరు చదువుకుంటున్నారు.

"నాన్నగారూ! నేను ఎమ్‌సెట్ మళ్లీ రాస్తానండీ! ఈసారి మంచి ర్యాంక్ తెచ్చుకుంటాను" మనోహర్ గబగబా చెప్పేశాడు.

"ఓ సంవత్సరం వేస్టు చెయ్యడం మంచిది కాదురా! నాలా చిన్న చదువులు చదివితే జీవితంలో ఎన్ని ఇబ్బందులు పడాలో! జీవితంలో నే పోగొట్టుకున్నదేమిటో ఇప్పుడర్థమవుతోందిరా! తల తాకట్టు పెట్టైనా నిన్ను చదివిస్తాను. చదువు సంగతి నువ్వు చూసుకో! డబ్బు సంగతి నే చూసుకుంటాను."

అతను కూడా వచ్చి వారి పక్కనే కూర్చున్నాడు.

"విజయవాడలో సీటు వచ్చిందటగా! ఎప్పుడు వెళ్లాలి?" వెంకటేశ్వరరావు అడిగాడు.

"ఎంతలేదన్నా సంవత్సరానికి 60,70 వేలు ఖర్చవుతుంది. అంత డబ్బు నాలుగేళ్లు కట్టాలంటే మాటలా?" జానకీ రాంగారు మనసులోని మాట బయటపెట్టారు.

"అదేం మాటరా? ఎలాగో అలాగ చదివించాలి! ఆడపిల్లలకి లక్షలు, కట్నాలు పోసి పెళ్ళిళ్ళు చెయ్యడం లేదా? అలాగే ఇదీనూ. చేతిలో ఎవరి దగ్గర అంత డబ్బు ఉంటుందీ? అవసరమైతే అప్పు చేయవలసిందే!" పురుషోత్తమరావుగారు ఖచ్చితంగా చెప్పారు.

"అప్పు చెయ్యడానికైనా మార్గం దొరకాలి కద నాన్నా!"

"వెతికితే మార్గం అదే దొరకుతుందిరా! ఏ అవకాశమూ వచ్చి తలుపు తట్టదు. దాన్ని వెతుక్కుంటూ మనమే వెళ్లాలి. అయినా వాడికి తెలివి ఉంది, శ్రద్ధ ఉంది, చదువుకోవాలనే పట్టుదల ఉంది. అటువంటి వారిని చదివించక మరెవరిని చదివించగలంరా?"

"వాడిలో అన్నీ ఉన్నాయ్! నాకు తెలుసు. కాని, చదివించే శక్తి మనకుండాలి కదా నాన్నా!"

"జానకీ రాం! నువ్వు నోరు మూసుకోరా! ఒకప్పుడు నిన్ను పెద్దచదువు చదివించాలని ఎంతో ఆశ పడ్డా! డబ్బు ముందే దాచిఉంచా! కాని, నువ్వు చేసిందేమిట్రా! స్నేహితులతో తిరిగి చెప్పినమాట వినక చదువంతా తగలపెట్టుకున్నావు! నీకు లేని గుణగణాలు వాడికున్నాయి. వాడి చదువు ఆపడానికి వీలులేదురా? నేను ఎందుకు వచ్చాననుకుంటున్నావు? వాడిని చదివించడానికేరా?"

తండ్రి మాటలు విన్నాక జానకీ రాంగారి నోరు పెగల్లేదు.

ఇద్దరూ వాదించుకుంటుంటే వెంకటేశ్వరరావు ఎన్నోసార్లు ప్రయత్నించాడు. కాని, అతన్ని మాట్లాడనివ్వలేదు వాళ్ళు. ఇప్పటికి అవకాశం చిక్కింది అతనికి.

"నే చెప్పేది వినండి మామయ్యగారూ! ప్రతి సంవత్సరం ఫీజు కట్టడానికి బ్యాంకులు లోను ఇస్తున్నాయి. ఆ లోను చదువు పూర్తయ్యాక మనోహరే తీర్చుకోవాలి. నేను బ్యాంకులో వివరంగా అన్నీ కనుక్కుని వచ్చాను. మిగతా ఖర్చులు మనం చూసుకోవాలి!"

అతను చెప్పిన పద్ధతి అందరికీ నచ్చింది.

"ఇదేమిటో చాలా బాగుంది కదరా! ఇప్పుడేమంటావురా జానకీ రాం?!"

"అవును నాన్నా! ఈ పద్ధతి బాగానే ఉంది. కానీ, పిల్లాడికి అంత అప్పు భారం పెట్టడం అంత బాగా లేదు" జానకీ రాం నసిగాడు.

తండ్రి మాటలకి చిన్నకొడుకు శ్యాంకి చాలా కోపం వచ్చింది. ఇంక తండ్రి తన మాట వినడని తెలుసుకున్నాడు. కాఫీ కూడా తాగకుండా వచ్చిన దారినే వెళ్లిపోయాడు.

పురుషోత్తమరావుగారు ఊపిరి పీల్చుకున్నారు.

"ఒరేయ్... జానకీ రాం! నాకు ఆరువేలు పెన్షన్ వస్తుంది కదా... నేను, మీ అమ్మ ఎక్కడ ఉంటే అక్కడే ఆ డబ్బు ఇస్తాను కదా! నాకు, మీ అమ్మకి కలిపి ఓ వెయ్యి ఇంటి ఖర్చుకు చాలురా! మాకు అయ్యే మందులు, అవీ నువ్వే కొంటావుగా! మిగిలిన 5 వేలు ప్రతీ నెల మనోహర్ చదువుకి ఇస్తానురా! అందుకే నేను బ్రతికి ఉన్నాను రా! మీ అమ్మకి ఓపిక తగ్గింది. ఏ పనీ చెయ్యలేకపోతోందిరా! ఆమెకి ఇక్కడ కాస్త చల్లని నీడ దొరుకుతుందని తీసుకు వచ్చానురా!" ఆ మాటలంటుంటే ఆయన కళ్ళు చెమర్చాయి.

జానకీ రాంగారు "అమ్మా!" అంటూ తల్లి కాళ్ళను చుట్టుకున్నాడు. సీతాలక్ష్మి అత్తగారి పాదాలకు నమస్కరించింది.

పెద్దకొడుకు, కోడలి ప్రవర్తనకు ఓ చల్లని గాలి కెరటం వచ్చి వారి గుండెలను తాకినట్లయింది. వారి మనస్సులు కుదుటపడ్డాయి.

"మనకు ఇంక మనోహర్ చదువే ముఖ్యంరా! అందని ఆకాశంలో ఉన్నా ప్రయత్నించి ఓ మెట్టు వేద్దాం! వచ్చే ఏడాది మరో మెట్టు. మెల్లిగా వాడే పైకి ఎక్కుతాడు!"

తండ్రి మాటలకి జానకీ రాంలో మరింత పట్టుదల పెరిగింది.

మనోహర్ మనసు ఆనందంతో తేలియాడింది.